



హెలిపాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు



సభావేదిక ప్రాంగణాన్ని చదును చేసి పనులు చేస్తున్న దృశ్యం



భారీగా.. రా.. కదలిరా

- ● రేపు దాచేపల్లిలో సభ
- ● జన సమీకరణకు విస్తృత ఏర్పాట్లు
- ● విజయవంతం చేయాలని నేతల ప్రచారం
- ● శ్రీకృష్ణదేవరాయలు, మక్కెన సహా పలువురి చేరికలు

(పిడుగురాళ్ల, గుంటూరు సిటీ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ సమీకరణలు చకచకా మారుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం రా.. కదలిరా సభ నిర్వహణకు టీడీపీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావాలని టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రా కదలిరా సభకు గురజాల సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన తిరుమల కోల్డ్ స్టోరేజి పక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు రాష్ట్ర నేతలు పాల్గొననున్నారు. చంద్రబాబు పాల్గొంటున్న సభను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించిన నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అసెంబ్లీ అభ్యర్థులు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు తరలివచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో గ్రామాలు, పట్టణాల్లో సభకు సంబంధించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కేడర్‌లో సమరోత్సాహం

పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం గురజాలలో జరిగే రా కదలిరా సభ నిర్వహణతో పార్టీ క్యాడర్‌లో సమరోత్సాహం నెలకొంది. ఇప్పటికే పల్నాడు జిల్లా వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా గురజాలకు యరపతినేని శ్రీనివాసరావు పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతుండటం.. ఈ నియోజకవర్గ పరిధిలో సభ ఏర్పాటుతో ఆయన నేతృత్వంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ విజయవంతానికి క్యాడర్‌ను సమాయత్తపరుస్తున్నారు. దాచేపల్లి సభలో వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సహా పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఈ అంశాన్ని లావుతో పాటు మక్కెన గురువారం ధ్రువీకరించారు. టీడీపీలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా చేరతారన్న ప్రచారం ఉంది. అయితే ఆయన చేరిక సందిగ్ధంలో ఉందని టీడీపీ నేతలు తెలిపారు. తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని జంగా చెబుతున్నారు. ఆయన ఇంకా వైసీ పీకి రాజీనామా కూ డా చేయలేదు. అయి తే జంగా అభ్యర్థి త్వంపై టీడీపీ అధిష్ఠానం నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే.

గురజాల సెంటిమెంట్ నేపథ్యంలో..

ఎన్నికలకు ముందు, అభ్యర్థుల ప్రకటన తర్వాత నిర్వహిస్తున్న రా.. కదలి రా సభతో పల్నాడులో యరపతినేని శ్రీనివాసరావు జనజాతరకు తెరలేపారు. హఠాత్తుగా ఖరాయిన ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సభ మొత్తం పల్నాడు జిల్లా ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. చంద్రబాబుకి పల్నాడులో గురజాల సెంటిమెంట్ బలంగా ఉంది. అందుకు తగ్గట్లుగా రా కదలిరా సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడ నుంచి కార్యక్రమం ఆరంభిస్తే విజయం తథ్యమన్న ఆలోచన ఉంది. 2014లో కూడా గురజాల నియోజకవర్గం పొందుగల నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించి గద్దెనెక్కారు. ఆ ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. ఇప్పుడు కూడా పూర్వపు వైభవం దిశగా అడుగులు వేసేందుకు గురజాలలో సభ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో పల్నాడులో టీడీపీ క్యాడర్ తీవ్రఒత్తిడికి గురౌతుంది. ఈ పరిస్థితుల్లో రా కదలిరా సభ క్యాడర్‌కు వెన్నుదన్నుకానుంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీ నేతలకు చంద్రబాబు ఈ సభ సాక్షిగా నేరుగా వార్నింగ్ ఇవ్వనున్నారు. క్యాడర్‌ను ఎన్నికలకు సర్వసన్నద్ధం చేసేందుకు ఈ పర్యటన ఉపకరిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్ష మందితో సభను నిర్వహించి తద్వారా ప్రత్యర్థుల శిబిరాన్ని మానసికంగా దెబ్బతీసేందుకు యరపతినేని పావులు కదుపుతున్నారు. గ్రామాలను ప్రభావితం చేయడంతో పాటు, ఎన్నికల గెలుపు ఓటమిని ప్రభావితం చేయగలిగిన నేతలు చంద్రబాబు సమక్షంలో తిరిగి పార్టీలోకి రానున్నట్లు తెలుస్తోంది.



చారిత్రాత్మకంగా సభ : యరపతినేని

గురజాలలో రా.. కదలిరా మరో చారిత్రాత్మక సభగా మిగిలిపోనున్నదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లి సమీపంలో జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబరులో ఆత్మగౌరవయాత్ర స్ఫూర్తితో రా.. కదలిరా సభ విజయవంతం చేస్తామన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో జరిగిన రా.. కదలిరా సభలకన్నా గురజాల సభ భారీగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవ్వాలని కోరారు. లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కదలి రావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ముఖ్యనేతలు కూడా ఈ సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

రేపు టీడీపీలో చేరుతున్నా : ఎంపీ లావు

దాచేపల్లిలో జరిగే రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు తరలిరావాలని పిలుపిచ్చారు. ప్రజా సంక్షేమం, పల్నాడు అభివృద్ధికి కట్టుబడి మరలా నరసరావుపేట లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అభివృద్ధి సాధించేందుకే తన ప్రతి అడుగు, ఆలోచన ఉంటుందన్నారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో సాధించుకున్న ప్రగతి పనులను పూర్తి చేసుకోవడంతో పాటుగా రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు సాధించుకునేందుకు ప్రజలు మళ్లీ తనను ఆశీర్వదించాలని కోరారు.



పది విద్యార్థుల కోసం ఫోన్లు

- ● పరీక్షలు ప్రారంభం కాకున్నా రంగంలోకి
- ● తల్లిదండ్రులకు జూనియర్ కళాశాలల నుంచి కాల్స్
- ● మీ అబ్బాయి/అమ్మాయిని చేర్పించమని డబ్బా కొట్టుడు
- ● ఇప్పుడు సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజు రాయితీ అని బేరసారాలు
- ● అసలు తమ నెంబర్లు వారి చేతికి ఎలా వెళ్లాయని తల్లిదండ్రుల ఆవేదన



గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఇంకా పరీక్షలే ప్రారంభం కాలేదు. అయినప్పటికీ కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇప్పటి నుంచే విద్యార్థులకు గాలం వేసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి అదే పనిగా రిసెప్షనిస్టుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తూ మా కాలేజ్‌లో చేర్పించమని ఏవేవో చెబుతూ వల విసురు తున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవు తాయి. అంటే ఏప్రిల్ మొదటి వారం వరకు పదో తరగతి విద్యార్థులు పరీక్షల హడావుడిలో ఉంటారు. ఆయా పరీక్షలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆ హడావుడిలో ఉంటారు. అయితే ఇంకా పరీక్షలు ప్రారంభం కాకున్నా ఫిబ్రవరి చివరి వారం నుంచి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. ఆలస్యమైతే ఎక్కడ విద్యార్థులు చేజారి పోతారేమోనని ఆత్రుత పడుతున్నాయి. దీంతో వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించాయి. ఆ ప్రకారం వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిల్లల్ని తమ కళాశాలలోనే చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. తమ కళాశాల మిగిలిన కళాశాలల కంటే గొప్ప అని ఐఐటీ, నీట్ సీట్లు సాధించామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పుడే సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, పరీక్షలు/ఫలితాల తర్వాత అయితే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బేరసారాలు చేస్తున్నారు. కొన్ని కళాశాలలు అయితే ఎంట్రన్స్ టెస్టు రాసేందుకు తీసుకురావాలని కోరుతున్నాయి. చాలా పాఠశాలలకు అనుబంధ కళాశాలలు కూడా ఉండటంతో వాటి యాజమాన్యాలు ఎలాగైనా తమ విద్యార్థులను బయటకు పోకుండా చేసేందుకు వివిధ రీతుల్లో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇతర కళాశాలలకు పోతారేమోనని తమ వద్ద చదువుతున్న పదో తరగతి విద్యార్థులకి ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ జాగ్రత్త పడుతున్నాయి.

అడ్వాన్స్ అడ్మిషన్లు..

కొన్ని కళాశాలలు అడ్వాన్స్ అడ్మిషన్లు కూడా చేపట్టాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను చేర్చుకుని వారి తల్లిదండ్రుల వద్ద అడ్వాన్స్ ఫీజులు కూడా జమచేసుకున్నాయి. 10వ తరగతి పరీక్షలు అయిపో యిన కొద్ది రోజులకే ఆన్‌లైన్ క్లాస్‌లు కూడా ప్రారంభిస్తామని సమాచారం ఇస్తున్నాయి. కాగా తమ ఫోన్ నెంబరు డేటా లీక్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యా శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి కమీషన్ల కోసం తమ పర్సనల్ నెంబర్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


విద్యా శాఖ నుంచి వివరాలు లీకు

పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన డేటా విద్యా శాఖ వద్దనే ఉంటుంది. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆధార్, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను కూడా అందులో నింపించారు. ఇప్పుడు ఆ డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చేరిందంటే కచ్చితంగా లీకు వీరులు విద్యాశాఖలోనే ఉన్నారని స్పష్టమౌతున్నది. ఇందుకోసం ఆయా కళాశాలల నుంచి అమ్యామ్యాలు ముట్టినట్లు సమాచారం. విద్యార్థుల డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలల చేతికి చిక్కడంతో వారి తల్లిదండ్రులకు నిత్యం మూడు నుంచి ఐదు కళాశాలల రిసెప్షనిస్టులు ఫోన్లు చేస్తున్నారు. పరీక్ష రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విధమైన ఫోన్‌కాల్స్‌తో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒకసారి వచ్చిన ఫోన్ నెంబర్‌ని బ్లాక్ చేసినా వేరే నెంబర్ల నుంచి ఫోన్లు చేసి పీడి స్తున్నారు.

తిరునాళ్లకు.. సాగర్ జలాలు

- ● నేడు సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు నీటి విడుదల

నరసరావుపేట, ఫిబ్రవరి 29: కోటప్పకొండ తిరునాళ్లలో నీటి వెతలు తీరనున్నాయి. తిరునాళ్ల కోసం సాగర్ నీటిని సరఫరా చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాగర్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కేఆర్ఎంబీ చేస్తోంది. మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చిందని జలవనరుల శాఖ ఎస్సీ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నీటిని తాగునీటి చెరువులు నింపేందుకు, కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. కుడికాలువ నుంచి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా చేస్తామన్నారు. జీబీసీ నుంచి చిలకలూరిపేట మేజర్‌కు నీటిని సరఫరా చేయనున్నట్టు చెప్పారు. నరసరావుపేట, చిలకలూరిపేట మునిసిపాల్టీ చెరువులను నింపుకొనేందుకు నీటిని వినియోగించు కోవాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలకు చిలకలూరిపేట మేజర్‌లో నీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటప్పకొండ దిగువన ఉన్న చెరువులను నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



సాగర్ కుడికాలువ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ● సీసీ కెమేరాల పర్యవేక్షణలో కేంద్రాలు
- ● పరీక్షలు పూర్తి అయ్యే వరకు 144 సెక్షన్
- ● 8.30కే కేంద్రాల్లోకి అనుమతి.. 9 తర్వాత నో ఎంట్రీ
- ● నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్లకు అనుమతి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 29:: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాలను ఇంటర్‌బోర్డు ఆర్ఐవో జుబేర్ గురువారం పరిశీలించారు. నెట్ నుంచి డౌన్‌లోడు చేసుకున్న హాల్‌టిక్కెట్లతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 27,605 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,830 మంది మొత్తం 59,435 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లాలో వీరికోసం 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను ఉదయం 8.30 నుంచే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం దాటినా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించమని జుబేర్ తెలిపారు. కేంద్రాల్లో పూర్తిస్థాయిలో బెంచీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలను సీసీ కెమేరాలతో అనుసంధానం చేశామని, ఇంటర్ బోర్డు కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు, సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఇప్పటికే పోలీసుశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పరీక్షల కోసం మొత్తం 92మంది సీఎస్‌లు, 1750మంది ఇన్విజిలేషన్ సిబ్బంది బాధ్యతలు నిర్వహించనున్నారు. కేంద్రాల వద్ద సెంటర్ పేరు, కోడ్ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్ఐవో జుబేర్


పౌరసరఫరాల శాఖకు.. లక్ష్మీ కటాక్షం

- ● ప్రతీ నెలా రేషన్ మాఫియా నుంచి దండిగా మామూళ్లు
- ● ప్రొటోకాల్ ఖర్చుల పేరుతో రేషన్ డీలర్లు, రైస్‌మిల్లర్ల వద్ద వసూళ్లు
- ● ఎన్నికల అధికారులు రానుండటంతో మరింతగా కలెక్షన్లు

గుంటూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల జిల్లా శాఖకు లక్ష్మీ కటాక్షం ఉట్టి పడుతోంది. ఎన్ని అక్రమాలు జరుగుతున్నా ఆ శాఖలో కొందరు అధికారులు కళ్లు మూసుకొని కూర్చుని ప్రతీ నెలా టంచన్‌గా మామూళ్లు దండుకొంటున్నారు. రేషన్ మాఫియాతో లింకులు పెట్టుకొని అసలు 6ఏ కేసులే నమోదు చేయడం లేదు. ఇక అధికారుల ప్రొటోకాల్ ఖర్చుల పేరుతో రేషన్ డీలర్లు, ఎండీయూలు, రైస్, డాల్ మిల్లర్లు, గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాల నిర్వాహకుల నుంచి అందినకాడికి పిండుకొంటున్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుండటం, ఆ తర్వాత పలువురు పరిశీలకులు రానుండటంతో వారికి ప్రొటోకాల్ కూడా చూసే బాధ్యత వీరిదే. ఆ పేరుతో రాబోయే రోజుల్లో మరింత వసూళ్లు జరిగే అవకాశం ఉండటంతో రేషన్‌డీలర్లు, మిల్లర్లు ఇప్పటినుంచే హడలిపోతున్నారు.

దాడులేవీ..?

జిల్లాలో పౌరసరఫరాల శాఖ తాను నిర్వర్తించాల్సిన అసలు విధులను పూర్తిగా మరిచిపోయింది. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ఏమాత్రం అదుపు చేయలేకపోతోంది. రేషన్ సరుకులు కూడా ప్రజల అవసరాల మేరకు తెప్పించలేకపోతోంది. కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీడీఎస్ బియ్యం పంపిణీ మాత్రమే తన విధి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ప్రజలకు సరిపడా కందిపప్పు, గోధుమపిండి ప్యాకెట్లు, పంచదార నిల్వలను తెప్పించలేకపోతోంది. ఈ శాఖకు జిల్లాలో ఒక డీఎస్‌వో, ఒక ఏఎస్‌వో, కొంతమంది డిప్యూటీ తహసీల్దార్లున్నారు. గతంలో ఆయా పోస్టుల్లో కొనసాగిన అధికారులు తరచుగా రేషన్ డిపోలు, పెట్రోలు బంకులు, సినిమా థియేటర్లు, రైస్‌మిల్లులు, వంటగ్యాస్ గోడన్లను తనిఖీ చేసేవారు. ఎక్కడా ఎలాంటి లోపాలున్నా 6ఏ కేసు నమోదు చేసేవారు. అలానే రేషన్ మాఫియాని నిరోధించేందుకు రాత్రి వేళల్లో గస్తీ కూడా కాసేవారు. ఇప్పుడాపరిస్థితి భూతద్దం పెట్టి వెదికినా కనిపించడం లేదు.



చెలరేగిపోతున్న మాఫియా..

గుంటూరు నగర కేంద్రంగా రేషన్ మాఫియా చెలరేగిపోతోంది. ఒకరిద్దరు అధికారుల సహకారంతో నగరంలోనే ఆర్‌టీసీ కాలనీ, శ్రీనగర్, నల్లచెరువు, ఏటీ అగ్రహారం, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని ప్రతీ నెలా రేషన్ బియ్యాన్ని వాటిల్లోకి తరలిస్తోంది. అక్కడి నుంచి లారీలకు లోడింగ్ చేసి జిల్లా సరిహద్దులు దాటిస్తోంది. ఎండీయూ వాహనంతోనే మాఫియా నియమించిన మనుషులు వచ్చి బియ్యంని అక్కడికక్కడే బహిరంగంగానే కొనుగోలు చేస్తున్నా తనకేమి పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. మాఫియా నుంచి దండిగా మామూళ్లు ముడుతుండటం వలనే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో వంటగ్యాస్ రీఫిల్లింగ్ విచ్చలవిడిగా కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదు. పెట్రోలు బంకుల తనిఖీని అసలు మరిచిపోయారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగితే సంబంధిత హోల్‌సేల్ వ్యాపారస్థులతో మాట్లాడి ప్రజలకు ధరలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నించాలి. అవసరమైన రైతుబజార్లు, రేషన్ డిపోల ద్వారా ఆయా సరుకులను ప్రజలకు పంపిణీ చేయించాలి. ఇవేమి ప్రస్తుతం జరగడం లేదు. అధికారుల ప్రొటోకాల్ పేరుతో వసూళ్లకు అంతు లేకుండా పోయింది. ఇటీవల ఒక అధికారి డీలర్లు, మిల్లర్లను తన వద్దకు పిలిపించుకొని ప్రొటోకాల్ అవసరాలకు ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. అప్పటినుంచి ప్రతీ డిపో/ఎండీయూ వద్ద నెలకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 972 రేషన్ డిపోలున్నాయి. అలానే 353 మంది ఎండీయూలున్నారు. ఈ విధంగా నెల తిరిగొచ్చేసరికి రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూళ్లు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వసూళ్లకు నగరంలో ఒక రేషన్ డీలర్ బాధ్యత తీసుకొన్నట్లు తెలిసింది. ఇక ఎన్నికల పరిశీలకులు రానుండటంతో ఈ వసూళ్ల వ్యవహారం పతాక స్థాయికి చేరుకొనే అవకాశం లేకపోలేదు.

21 మంది ఎస్ఐల బదిలీ

గుంటూరు, ఫిబ్రవరి 29: జిల్లాలో 21 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్‌డూడీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం హనుమంతరావు	లాలాపేట	కొత్తపేట
భాగ్యరాజు	అరండల్‌పేట	పాతగుంటూరు
అంజయ్య	నగరంపాలెం	తాడికొండ
డీ అశోక్	నల్లపాడు	తుళ్ళూరు
జీ ప్రతాప్‌కుమార్	దుగ్గిరాల	తాడేపల్లి
సీహెచ్ వాసు	తుళ్లూరు ట్రాఫిక్	మేడికొండూరు
సీహెచ్ కిషోర్	ఫిరంగిపురం	మంగళగిరి రూరల్
బత్తిని వినోద్‌బాబు	డీసీఆర్‌బీ	వట్టిచెరుకూరు
షేక్ ఖాదర్‌బాషా	సీసీఎస్	మంగళగిరి టౌన్
ఎం వెంకటేశ్వర్లు	సీసీఎస్	చేబ్రోలు
పీ అనిల్‌కుమార్	సీసీఎస్	నల్లపాడు
ఏవీ సుబ్బారావు	సీసీఎస్	తెనాలి రూరల్
కే బాలకృష్ణయ్య	సీసీఎస్	ప్రత్తిపాడు
పీ వీరనారాయణ	కంట్రోల్‌రూం	ఫిరంగిపురం
సీహెచ్ సదాశివరావు	కంట్రోల్‌రూం	ఫిరంగిపురం
షేక్ కరిముల్లా	స్పెషల్ బ్రాంచ్	తెనాలి - 1టౌన్
ఎస్ సాయిప్రసాద్	స్పెషల్ బ్రాంచ్	తాడేపల్లి
డీ రవీంద్రబాబు	వీఆర్	తాడికొండ
ఎం రాజకుమార్	స్పెషల్ బ్రాంచ్	పొన్నూరు టౌన్
బీ శివప్రకాష్	వీఆర్	స్పెషల్ బ్రాంచ్
బీ మహేంద్ర	మంగళగిరి టౌన్	దుగ్గిరాల



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

న్యాయం అడిగితే కేసులతో వేధింపులు

● 1535వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 29: రాజధాని అమరావతికి జీవనాధారమైన మూడు పంటలు పండే భూమినిచ్చిన తమపై అక్రమ కేసులు పెడతారా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1535వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, న్యాయం జరిగేంతవరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. అక్రమ కేసులకు భయపడం.. వెనక్కి తగ్గమన్నారు. ఐదు కోట్లమంది రాజధాని అమరావతి కావాలని కోరుకుంటుంటే మంత్రులు విశాఖలో రహస్యంగా కార్యాలయాలు ప్రారంభిస్తుండటం సిగ్గుచేటన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమంలో దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

భార్య హత్య కేసులో జీవిత ఖైదు

గురజాల లీగల్, ఫిబ్రవరి 29: భార్యను హత్య చేసిన భర్తకు కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళితే.. మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన ఎస్కే నాగుర్ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి మాచర్ల పట్టణానికి చెందిన లాలు కుమార్తె మస్తాన్‌బీతో వివాహం జరిగింది. భార్యతో తరచూ గొడవ పెట్టుకుంటూ కొడుతుండే వాడు. జూలై 13, 2017న మధ్యాహ్న సమయంలో మస్తాన్‌బిని పలుగుతో పొడిచి హత్య చేశాడు. అత్తమామల ఫిర్యాదుతో కేసునమోదు కాగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ గురజాల 10వ అదనపు జిల్లాకోర్టు న్యాయాధికారి జి.వెంకటేశ్వర్లు తీర్పు వెల్లడించారు.

పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, ఫిబ్రవరి 29: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మండాదిలో జరిగింది. గ్రామానికి చెందిన మూలంరెడ్డి శ్రీనివాసరెడ్డి (50) మూడేళ్లుగా తనకున్న రెండెకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. అననుకూల పరిస్థితులతో రూ.10 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనపడక మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

7న వేమూరులో చంద్రబాబు పర్యటన

● ప్రజాస్వామ్య విలువలను కాలరాసే జగన్‌కు బుద్ధి చెప్పాలి
● టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పని చేయాలి
● మాజీ మంత్రి ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 29: వేమూరు నియోజకవర్గంలో ఈనెల 7న టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు తెలిపారు. గురువారం సాయంత్రం నియోజకవర్గ కేంద్రమైన వేమూరు ఎన్టీఆర్ పురవేదికవద్ద వేమూరు మండల టీడీపీ, జనసేన శ్రేణుల సమన్వయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనను నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన శ్రేణులు విజయ వంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాలరాసి అధికార దాహంతో పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని, అందుకు టీడీపీ, జనసేన శ్రేణులు సంసిద్ధగా ఉండాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం రెండు పార్టీలతో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. గెలుపు దిశగా సమన్వయంతో ముందుకు నడవాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను నయవంచనతో పాలించిన జగన్‌కు విలువైన ఓటు ద్వారా చావు దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన వార్డుల వారీగా సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లను చైతన్య పరచాలన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు నడిపే విధంగా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రణాళికాబద్ధమైన ఆలోచనలు సాగిస్తున్నారన్నారు. యువత, మహిళలకు ప్రాధాన్యమిస్తూ ప్రకటించిన మేనిఫెస్టో వివరాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుందని కేవలం 40 రోజుల వ్యవధిలోనే ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల పార్టీ అధ్యక్షులు దండే వెంకట సుబ్బారావు, ఘంటా స్వాతి, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, శివకృష్ణ, జనసేన నాయకులు అనూరాధ, రాజేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనం తథ్యం

● ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి29: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల కూటమి ప్రభంజనాన్ని సృష్టించి అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పెద్దింటమ్మ ఆలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ పేరిట ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు పంచిపెట్టి ఓట్లు అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ కూటమిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి తనకు ఉన్న అధికారాన్ని అడ్డుపెట్టుకొన్ని రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి దోచుకున్నారన్ని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు ఎంపీ అభ్యర్థులు వైసీపీ నుంచి పోటీ చేయకుండా తప్పుకుంటున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా, రేషన్, మద్యం మాఫియా, పేదల భూముల ఆక్రమణలు, వేల కోట్ల దోపిడీపై ఇటీవల పొన్నూరులో జరిగిన సభలో ప్రజాచార్జి షీట్‌ను విడుదల చేసినట్లు చెప్పారు ఈ అక్రమాలను నిలదీయకుండా విచారణ జరపకుండా దోపిడీకి పాల్పడిన కిలారి వెంకట రోశయ్యను జిల్లా స్థాయిలో దోచుకోమని ఎంపీ అభ్యర్థిగా ప్రమోషన్ ఇచ్చారన్ని ఎద్దేవా చేశారు. మహిళలు మంగళహారతులు పట్టి నరేంద్ర కుమార్ దంపతులను తమతో పాటు గ్రామంలోని తీసుకెళ్లారు. ప్రచారం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు హాజరయ్యారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులు

ప్రత్తిపాటి కుమారుడి అరెస్టు అక్రమం

● భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
● సీఎం దిష్టిబొమ్మ దహనం



చిలకలూరిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 29: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు ప్రత్తిపాటి శరత్‌బాబు అక్రమ అరెస్టు పట్ల గురువారం చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అరెస్టువార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాటి పుల్లారావు నివాసం వద్దనున్న టీడీపీ శ్రేణులు బయటకువచ్చి నిరసన తెలిపారు. భరత్ బాబు అరెస్టును ఖండించారు. సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి 'సీఎం జగన్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. జగన్ దిష్టిబొమ్మను దహనంచేశారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో మంగళగిరి వద్దనున్న టీడీపీ కేంద్ర కార్యాలయం వద్దకు తరలి వెళ్ళి పుల్లారావుకు బాసటగా నిలిచారు.

అక్రమ కేసులతో వేధింపులు : పుల్లారావు

రాజకీయ క్షేత్రంలో నేరుగా ఎదుర్కోలేక జగన్ అక్రమ కేసులతో ప్రత్యర్థులపై వేధింపులకు పాల్పడుతున్నారని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. తన కుమారుడు శరత్ బాబును అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కంపెనీలో డైరెక్టర్‌గా గానీ, కనీసం వాటాదారుడిగా లేని తన కుమారుడిపై జీఎస్టీ ఎగవేతల ఉల్లంఘన కేసులు ఎలా పెడతారంటూ ప్రశ్నించారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల ద్వారా బనాయిస్తున్న ఇటువంటి తప్పుడు కేసులకు బెదిరేది లేదని స్పష్టంచేశారు. తన కుమారుడి స్టేట్‌మెంట్ తీసుకోవటం కోసమని పిలిచి అదుపులోకి తీసుకొని అనుకూల మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని ధ్వజమెత్తారు. తన కుటుంబానికి ఉన్న విశ్వసనీయతను దెబ్బతీయటానికే ఇలా చేస్తున్నారని అన్నారు. అక్రమ కేసులకు భయపడేదే లేదని, వాటిని చట్టపరంగా ధీటుగా ఎదుర్కొంటామని ఆయన వివరించారు. చిలకలూరిపేటలో మంత్రి రజిని వైఫల్యాలే వైసీపీ ఓటమికి బాటలు పరిచాయని చెప్పారు. చిలకలూరిపేట నుంచి తన సీటు నాలుగురోజుల క్రితం పార్టీ ఖరారు చేసిన రోజు సాయంత్రం రెవెన్యూ ఇంటెలిజెన్స్ తమ కుమారుడిపై కేసు నమోదు చేసిందన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అదుపులోకి తీసుకున్నారని ఆయన చెప్పారు.





విజయవాడ బందరురోడ్డులోని పోలీసు కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ కార్యకర్తలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నాగులేరుకు కృష్ణా జలాలు..

● పల్నాడు కలెక్టర్ శివశంకర్

దాచేపల్లి, ఫిబ్రవరి 29: దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చడం కోసం నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో కలిసి ఎమ్మెల్యే కాసు నాగులేరును పరిశీలించి నీటి ఎద్దడికై ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. నాగులేరుకు కృష్ణాజలాలను విడుదల చేయడం ద్వారా నాగులేరుకు ఇరువైపులావున్న కారంపూడి, దాచేపల్లి మండలాలకు చెందిన 30కిపైగా గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కార మవుతుందని తెలిపారు. నాగులేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించామని, నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ఎమ్మెల్యే కాసు వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి మునిసిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, జడ్పీటీసీ మూల గుండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కటకం జయశ్రీ, కోట కృష్ణ, టమాట సుభాని, మందపాటి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోచుకునేందుకే భూహక్కు చట్టం

● గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్



మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్

గుంటూరు(లీగల్),ఫిబ్రవరి29:ప్రజల ఆస్తులను దోచుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని తీసుకొచ్చిం దని గుంటూరుబార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ సురేష్ అన్నారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2వ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఈచట్టం ప్రకారం అన్ని రకాల స్థిరాస్తులపై రెవెన్యూ శాఖవారే హక్కులను నిర్ధారిస్తారని, వారి తీర్పులపై అప్పీలును రెవెన్యూశాఖ పరిధిలోని జాయింట్ కలెక్టర్‌కు అప్పజెప్పార న్నారు. వారి తీర్పులపై హైకోర్టుకు వెళ్ళవలసిందేనని, జిల్లా, క్రింది కోర్టులకు ఆ తీర్పులలో జోక్యం చేసుకొనే హక్కు లేద న్నారు. ఈ చట్టం యాజమాన్య హక్కులకు అత్యంత ప్రమాదకర మని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి అనేక రూపాల్లో నిరసన వ్యక్తంచేస్తున్నా ప్రభుత్వం ఈ చట్టాన్ని సమర్థిస్తూ రీ-సర్వే పేరుతో అమలు చేస్తుందని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని మొత్తం 149 బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో ఒక మహాసభ నిర్వహించి, ఈ చట్టాన్ని రద్దు చేసేవరకు ఉద్యమించాలని బార్ అసోషియేషన్ నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా మార్చి 2న ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు రాష్ట్రంలోని అన్ని బార్ అసోషియేషన్ల ప్రతినిధులతో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో గుంటూరు బార్ అసోషియేషన్ ఉద్యమ కమిటి సభ్యులు ఎన్. రామ్మోహన్‌రావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్. బ్రహ్మానంద రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిగురుపాటి రవీంద్రబాబు, కొల్లి శంకరరావు, లావు అంకమ్మ చౌదరి, మాజీ ఏపీపీ కాళిదాసు, సిద్దా సత్యనారాయణ, అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, నంబూరు పాములు, పీ.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

1,30,299 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,40,562 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,30,229 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,06,923 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20500
నెంబరు. 5	13000	18800
273	11000	15000
341	9000	20500
4884	13000	16500
సూపర్ 10	12500	13800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9000	20400
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12500



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

అడ్డగోలుగా అధికార దుర్వినియోగం

● ప్రజల రక్తాన్ని తాగుతున్న పిన్నెల్లి సోదరులు
● టీడీపీ-జనసేన మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 29: నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డగోలుగా వాడుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం పట్టణంలో జరిగిన ఘర్షణకు సంబంధించి వైసీపీ నేతలు పోలీస్‌శాఖ కళ్లకు గంతలు కడుతున్నారని మండిపడ్డారు. ఘర్షణ సమయంలో కర్రలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఏ షాపు నుంచి తెచ్చారు.. కర్రతలతో వచ్చింది ఎవరు.. టీడీపీ నేతల చేతిలో కర్రలు, కత్తులు, రాడ్లను ఎవరైనా చూశారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అబద్ధాలు చెప్పడం పిన్నెల్లి సోదరులకు పరిపాటిగా మారిందన్నారు. అన్నీ బ్రహ్మారెడ్డిపై నెడుతున్నారని ఎద్దేవా చేశారు. రెంటచింతల మండలం మంచికల్లులో రెచ్చగొట్టింది ఎవరు.. దాడి చేసింది ఎవరు.. అంటూ ప్రశ్నించారు. బురద జల్లడం, దాడులు చేయడం వంటి వాటిపై స్థానిక ఎమ్మెల్యే పథకం రచిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. వైసీపీ నుంచి కార్యకర్తల వలసలు ఎక్కువయ్యాయని, దీన్ని నిరోధించేందుకు గొడవల్లో ఇరికించాలని చూస్తున్నారని అన్నారు. 20 ఏళ్ల క్రితం జరిగిన మర్డర్లు గురించి మాట్లాడుతున్నారని, ఇరువురు ముస్లింలను చంపించిన ఘనత నీది అంటూ ఎమ్మెల్యే పీఆర్కేను ఉద్దేశించి అన్నారు. టీడీపీ నేతలు నిసిగ్గుగా 307 కేసులు పెడుతున్నారన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన దాడితో ఎటువంటి సంబంధం లేని కేశవరెడ్డి, గురవారెడ్డి, మురళీలపై కేసులు నమోదు చేశారన్నారు. పోలీస్‌స్టేషన్లో టీడీపీ నేతలు ఫిర్యాదు చేసే పరిస్థితి లేదన్నారు. జెండాచెట్టు వద్ద ఘర్షణలో ఒక వలంటీరు, కౌన్సిలర్ భర్త కర్రలు పట్టుకొని దాడికి దిగారన్నారు. జనసేన నేత బూసా రామాంజనేయులు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పోలీసు అధికారులు తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలన్నారు. బ్రహ్మారెడ్డి వెంట జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, గుండెబోయిన సాంబశివరావు, గంధం మల్లయ్య, కేసానుపల్లి కృష్ణబాబు, వెంకటరమణ, మదీనా, లాల్ కృష్ణ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

అధికారం అండతో గెలవాలని కుయుక్తులు

● జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె ధ్వజం

గుంటూరు, ఫిబ్రవరి 29: ఐదేళ్ల పాలనలో ప్రజావిశ్వాసం కోల్పోయిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, వలంటీర్లను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగం చేసైనా గెలుపొందేందుకు విఫలయత్నం చేస్తున్నారని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. గురువారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అనేది వైసీపీ అధినేత, రూ.కోట్లాది ప్రజాధనంతో ఏర్పాటు చేసుకొన్న సొంత సైన్యమని గాదె ధ్వజమెత్తారు. తెలుగుదేశం, జనసేన పార్టీకి చెందిన ఓటర్లను వలంటీర్ల సహకారంతో ప్రలోభపెట్టి లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. నిన్న మంగళగిరిలో జరిగిన వలంటీర్ల సమావేశంలో 19 విధి విధానాలు కలిగిన నిర్ణయ పత్రాలను వారికి అందజేసిన విషయం నిజం కాదా? అంటూ గాదె నిలదీశారు. ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, గుంటూరు నగరంలో ఉన్న వలంటీర్లతో సమావేశం నిర్వహించి రూ.25 వేల నగదు అందజేశారని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి ఎన్నికలకు రావాలని ఆయన సవాల్ విసిరారు. వలంటీర్ల వ్యవస్థతో రాజకీయ లబ్ధి పొందాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలపై త్వరలో గవర్నర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు యర్రంశెట్టి పద్మావతి, శిఖా బాలు, చట్టాల త్రినాథ్, సిరిగిరి శ్రీనివాస్, చింతా శివ, గోపిశెట్టి సాయి, యర్రంశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీని మొదటి స్థానంలో నిలపాలి

● గతంలో అవకతవకలపై తలదించుకోవాల్సి వచ్చింది
● సర్వసభ్య సమావేశంలో చైర్మన్ రాము

గుంటూరు, ఫిబ్రవరి 29: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేస్తున్న గుంటూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకును మరింత అభి వృద్ధి పథంలో నడపాలని బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజ నేయులు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని బ్యాంకు సమావేశ మందిరంలో గురువారం బ్యాంకు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకారశాఖను మరింత బలోపేతం చేశార న్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇటీవల జరిగిన ఓ సదస్సులో సొసైటీలో జరిగిన అక్రమాలపై తల దించుకోవాల్సి వచ్చిందని రాము ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో జరిగే అక్రమాలపై తాము చర్యలు తీసుకోవచ్చు కానీ సొసైటీలో జరిగే అక్రమాలపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదన్నారు. త్వరలో ఎన్నికల రానున్నాయని, రైతులకు వద్దకెళ్ళి ఓట్లు అడగాల్సి ఉంటుందని, ఈ పరిస్థితుల్లో ఏ సమస్యలు ఉత్పన్నం కాకూడదని సూచించారు. అనంతరం 2024-25 బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో సీఈవో కృష్ణవేణి, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

- జీవో జారీ చేసిన మునిసిపల్ శాఖ స్పెషల్ సెక్రెటరీ శ్రీలక్ష్మి
- వివరాలు వెల్లడించిన మేయర్, కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం నగర ప్రజలకు వడ్డీలేకుండా పన్ను చెల్లించుకునేందుకు గొప్ప సదావకాశం కల్పించిందని, దీనిని సద్వినియోగాపరచుకొని నగరాభివృద్ధికి సహకరించాలని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, అప్పటివరకు బకాయిలపై ఉన్న వడ్డీపై రాయితీనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 35 జారీచేసింది. కమిషనర్ మాట్లాడుతూ అస్తి, ఖాళీ స్థలం పన్నులపై వడ్డీ మాఫీ 31-3-2024లోపు ఏక మొత్తంలో చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ఆస్తి, ఖాళీ స్థలం పన్నుబకాయిలపై వడ్డీ, 2023-24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుపై వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. వడ్డీతో పన్ను చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు ఈవడ్డీ రాయితీ అందుబాటులో ఉంటుందని తెలియచేశారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకొని, ఏక మొత్తంలో నగరపాలక సంస్థకు చెల్లించవలసిన బకాయిలను వడ్డీ లేకుండా చెల్లించి సద్వినియోగపరచుకోవాలన్నారు. అందుకు అవసరమైన ప్రత్యేకకౌంటర్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మిర్చి యార్డులో 12 మందిపై కేసులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 29 :కాటాలపై సరైన ముద్రలు లేకుండా తూకం తూస్తున్న 12 మంది మిర్చియార్డు వ్యాపారులపై కంట్రోలర్ లీగల్ మెట్రాలజి అధికారులు గురువారం కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల్లో అక్రమాలకు పాల్పడిన 8 మంది బియ్యం వ్యాపారులు, ఇద్దరు ఇనుము కొట్టు వ్యాపారులపైనా కేసులు నమోదు చేశారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అధిక ధరలకు కూల్‌డ్రింక్ లు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు అయ్యాయి. ఈదాడుల్లో లీగల్ మెట్రాలజి జేసీ మాధురి, డిప్యూటీ కంట్రోలర్ టి.షాలేం రాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభతో

తాడేపల్లి ప్యాలెస్‌లో భూకంపం !



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెంలో జరిగిన టీడీపీ- జనసేన జెండా విజయోత్సవ సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో భూకంపం వచ్చిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదని, సభతో తాడేపల్లి ప్యాలెస్‌కు పగుళ్లు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో జరిగిన సభతో వైసీపీ పాలన అంతం ఖాయమైందని ఆయన అన్నారు. టీడీపీ- జనసేన పొత్తుతో రాష్ట్రంలో నూతన శకం మొదలైందని ఆ పొత్తుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఓటమి తథ్యమని మన్నవ మోహనకృష్ణ అన్నారు. సభ విజయోత్సవం చూసి ఓర్వ లేక మంత్రి గుడివాడ అమర్నాథ్ ఇష్టం వచ్చినట్లు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబును విమర్శించే అర్హత గుడివాడకు లేదని హితువు పలికారు.



వివరాలు వెల్లడిస్తున్న బ్రహ్మేశ్వరరావు, దుర్గారావు తదితరులు

ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ సౌజన్యంతో

మార్చి 2 నుంచి క్యారమ్ ఛాంపియన్‌షిప్

గుంటూరు, ఫిబ్రవరి 29 : ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ సౌజన్యంతో మార్చి 2 నుంచి 4 వరకు 51వ ఆంధ్ర రాష్ట్ర సీనియర్ అంతర జిల్లాల క్యారమ్ ఛాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలకవర్గం వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ పోటీలలో సీనియర్, వెటరన్ విభాగాల్లో పురుషులు, మహిళలు, పాల్గొననున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మైనేని బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుండి 125 మంది క్రీడాకారులు హాజరు కానున్నారన్నారు. అసోసియేషన్ ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీలలో మొదటి ఆరు స్థానాల్లో అత్యంత ఉత్తమ ప్రదర్శన కనపరిచిన పురుషులు, మహిళలను, అదేవిదంగా మొదటి రెండు స్థానాలలో ఉత్తమంగా రాణించిన వెటరన్ పురుషులు, మహిళలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో సంయుక్త కార్యదర్శి, కొండ్ర గుంట శ్రీనివాసరావు, క్యారమ్స్ కమిటీ సభ్యుడు తట్టుకోళ్ల కేశవయ్య, క్యారమ్స్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ పాలమని శ్రీనివాస్, జిల్లా క్యారం సంఘ అధ్యక్షులు ఎంకేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చియార్డులో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

గుంటూరు, ఫిబ్రవరి 29: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మిర్చియార్డులో ఉచిత ఆయుర్వేదిక్ మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైసీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై.షేక్, ఆయుర్వేదిక్ డాక్టర్ చక్రధర్‌లు తెలిపారు. ఆర్ అగ్రహారంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, మేయర్ మనోహర్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎన్ రాజనారాయణలు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంబిస్తారన్నారు. వైద్యశిబిరంలో రోగులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

రాష్ట్రంలో దయనీయ పరిస్థితులు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పెమ్మసాని, నాని

- విశ్వనగర నిర్మాత చంద్రబాబును జైల్లో పెట్టి వేధించారు..
- గల్లా జయదేవ్‌కు ఎంతో అన్యాయం చేశారు
- తిరోగామి చర్యలు చూసి చలించిపోయాను
- ప్రజలకు అండగా ఉంటా, జన్మభూమి రుణం తీర్చుకుంటా
- అందుకే టీడీపీ తరపున ప్రజల్లోకి వస్తున్నా..!
- టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్
- టీడీపీ గుంటూరు పశ్చిమ నేతలతో ఆత్మీయ సమావేశం
- పార్టీ అధినేత నిర్ణయాన్ని గౌరవిస్తా: కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నెలకొన్న దయనీయ పరిస్థితులు చూసి తట్టుకోలేక, తన వంతు కర్తవ్యంగా ప్రజలకు అండగా ఉంటానికి, వారికి మేలు చేయడానికే నేను రాజకీయాల్లోకి వచ్చా. చంద్రబాబులాంటి మహనీయుణ్ణి అమానుషంగా జైల్లో పెట్టి 52రోజులు వేధించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసిన మహరుషిని అలా వేధించడం చూడలేకపోయా. జయదేవ్‌కు ఎంత అన్యాయం జరిగిందో అందరికీ తెలిసిందే. అయనపై కక్ష సాధింపు చర్యల ఫలితంగా 20 వేల కుటుంబాలకు, అంటే 80 వేల మందికి అన్యాయం జరుగుతోంది. జన్మభూమి రుణం తీర్చుకోవడం ప్రతి మనిషికి కర్తవ్యం. ఆ కర్తవ్యంలో భాగంగానే టీడీపీ తరుపున ప్రజల్లోకి వస్తున్నా' అంటూ టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేతలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని పాల్గొన్నారు. టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌లు హాజరయ్యారు. ముందుగా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గ నేతలను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిస్థితులు అత్యంత దయనీయంగా వున్నాయన్నారు. యువత నిరుద్యోగ సమస్యతో నిర్వేదానికిలోనై ఉందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు, ఉపాధి లేక ఆటోలు నడుపుకుంటుండటం తనను కలిచివేసిందన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చడానికి, యువత భవిష్యత్తుకు బరోసాను కల్పించడం కోసమే తాను వచ్చానన్నారు. ఎంతో మంది ఆశావహులు ఉన్నప్పటికీ అందరికీ టికెట్ ఇవ్వలేరని, ఈ విషయంలో చంద్రబాబు, లోకేశ్‌లను అర్థం చేసుకుని కార్యకర్తలు సహకరించాలని ఆయన కోరారు. కోవెలమూడి రవీంద్ర 2009లో, 2014 సీటు త్యాగం చేశారు. 2019లో కూడా వేరే వారికి సీటు ఇచ్చినా ఆ వ్యక్తిని గెలిపించారు. కానీ ఆ వ్యక్తి కనీస కృతజ్ఞత లేకుండా పార్టీ మారారు. అయినప్పటికీ మళ్లీ పార్టీని భుజనా వేసుకుని, అత్యంత కష్టమైన ఈ నాలుగు సంవత్సరాలు పార్టీని నడిపించారు. అలాంటి వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతి తక్కువ మందే వుంటారన్నారు.

కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ సీటు విషయంపై తాను అధినేత చంద్రబాబునాయుడి నిర్ణయాన్ని గౌరవిస్తానన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ గతంలో పల్నాడులో పలు సేవా కార్యక్ర మాలు నిర్వహించారన్నారు. ఇప్పుడు ప్రజలతో మమేకమై నిజాయితీగా సుదీర్ఘమైన రాజకీయాలు చేయాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారని, ఆయనకు పశ్చిమలో అత్యధిక మెజారిటీ వచ్చేలా కృషి చేస్తానన్నారు.

తెనాలి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం, దుష్ట దుర్మార్గమైన పరిపాలన సాగనంపడం కోసం కలిసి పనిచేస్తున్నాం. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా చంద్రశేఖర్ రాబోతున్నారన్నారు. ఆయనను గెలిపించుకోవాలన్నారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో అత్యధిక మెజార్టీవచ్చేలా కృషి చేస్తానని చంద్రశేఖర్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా పెమ్మసానిని పార్టీనేతలు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నిమ్మల శేషయ్య, పిల్లి మాణిక్యరావు, కనపర్తి శ్రీనివాసరావు, మద్దిరాలమ్యాని, సుఖవాసి శ్రీనివాసరావు, తెలుగు మహిళ వెంకటలక్ష్మి, రావిపాటి సాయికృష్ణ, కొల్లి అనిల్, పార్టీ నేతలు అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పెమ్మసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కనపర్తి, పిల్లి మాణిక్యరావు, మ్యాని

పోలీస్ శాఖలో వారి సేవలు భేష్

- ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలకు సత్కారం

గుంటూరు, ఫిబ్రవరి 29: జిల్లా పోలీసుశాఖలో దాదాపు 40 సంవత్సరాల పాటు పనిచేసి అధికారుల మన్ననలు పొంది గురు వారం ఉద్యోగ విరమణచేసిన ఎస్ఐ సుభాని, ఏఎస్ఐ పోలేరయ్యలు అందించిన సేవలు భేష్ అని జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం వారిద్దరిని ఘనంగా సత్కరించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల ప్రకారం వీ.రమణమూర్తి, జిల్లా పోలీసు అధికారుల సంఘం కమిటీ సభ్యులు వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పోలీస్ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్, కరిముల్లా, లక్ష్మణ్, సాంబశివరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి

- వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ళ మురళి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి29: రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు వడ్డెర్లకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని, లేనిపక్షంలో ఆయా రాజకీయ పార్టీలకు వడ్డెర్లు దూరంగా ఉంటారని వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ళ మురళి హెచ్చరించారు. గురువారం గుంటూరు, అరండల్‌పేటలో ఓ హోటల్లో వడ్డెర రాజకీయ చైతన్య సభ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏపీలో దాదాపు 30 లక్షల జనాభ కలిగి, రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ఓటన్లు కలిగి ఉన్న హిందూపురం, నరసరావుపేట పార్లమెంటు స్థానాలు, కావలి, వుట్టపుర్తి శాసనసభ స్థానాలను కేటాయించాలని కోరారు. ఇప్పటికే ఆ దిశగా టీడీపీ అధినేత చంద్రబాబునాయడు ఆలోచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వడ్డెర్లు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనచేసి టీడీపీ విజయానికి అహర్నిసలు కష్టపడి, చంద్రబాబును సీఎం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తామన్నారు. సభలో వడ్డెర సంఘ ప్రతినిధిలు బత్తుల వెంకటేష్, దేవళ్ల వెంకట్, వేణుగోపాల్, మల్లెల జయరామ్, దేవళ్ళ మల్లికార్జునరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి రిమాండ్

- బంగారు నగలు, ద్విచక్రవాహనాలు స్వాధీనం

గుంటూరు, ఫిబ్రవరి 29: మహిళల వేషంలో, బుర్కా ధరించి తిరుగుతూ తాళం వేసిన ఇళ్ళను గుర్తించి రెక్కీ నిర్వహిస్తూ రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా, సూర్యాపేట మండల పరిధిలోని రాయణగూడెం గ్రామానికి చెందిన బొంతా యాదగిరిని నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక లాప్టాప్, మరో ట్యాబ్, సుమారు 6 గ్రాముల ఒక జత బంగారపు చెవి బుట్టలు, 10 గ్రాముల ఒక జత వెండి పట్టీలు, 7 గ్రాముల వెండి ఉంగరం స్వాధీనం చేసుకొని, రిమాండుకు పంపినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. ఇటీవల నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో యదగిరి నిందితుడు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా పర్యవేక్షణలో నల్లపాడు సీఐ రాంబాబు పక్కా సమాచారంతో గురువారం గుంటూరు రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ విశ్వకర్మయోజన పథకం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్

గుంటూరు సిటీ,ఫిబ్రవరి 29: జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ విశ్వకర్మ యోజన పథకం అందేలా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ కోరారు. గురువారం జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి మదన్ శెట్టిని కలిసిన ఆయన విశ్వకర్మ యోజన పథకం అమలుపై చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజికంగా వెనక పడుతున్న కుల వృత్తులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారన్నారు. 18 రకాల కుల వృత్తులను ఈ పథకంలో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చరకకుమార్‌గౌడ్, పద్మనాభం, కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంకటరమణ పాల్గొన్నారు.



జయహో బీ సీ కార్యక్రమంలో పాల్గొని ఐక్యత చాటుతున్న టీడీపీ నాయకులు

బీసీ సంక్షేమం, అభ్యున్నతి టీడీపీ తోనే..

- 'జయహో బీసీ' సభలో టీడీపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి29: బీసీ సంక్షేమం, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే టీడీపీ బీసీ శ్రేణుల ఏకైక లక్ష్యంగా ఉండాలని టీడీపీ జిల్లా నేతలు ఆ పార్టీ బీసీ నేతలకు పిలుపునిచ్చారు. గురువారం అరండల్‌పేటలో టీడీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా 'జయహో బీసీ'కార్యక్రమం నిర్వహించారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో 13 జిల్లాలకు 8 మంది బీసీలను మంత్రులుగా చేసి, బీసీల పక్షపాతిగా చంద్రబాబు నిలిచారన్నారు. బీసీలపై జగన్‌ది కపట ప్రేమని విమర్శించారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్టీఆర్, చంద్రబాబు బీసీలను ప్రోత్సహించి రాజకీయంగా వారికీ భవిష్యత్తు ఇచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, మొహమ్మద్ నసీర్, డేగల ప్రభాకర్, నిమ్మల శేషయ్యలు మాట్లాడుతూ టీడీపీ స్థాపించినప్పుడు 24శాతం ఉన్న రిజర్వేషన్లు చంద్రబాబు 34 శాతానికి పెంచారన్నారు. జగన్ పాలనలో 26 మంది బీసీ నేతల్ని హత్య చేశారని, 650 మందిపై తప్పుడు కేసులు, 2500 మందిపై దాడులకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ప్రతిపక్ష బీసీ నాయకులను ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టి అరెస్టులు చేసి కక్షపూరిత రాజకీయాలు చేసిన జగన్ రెడ్డిని బీసీలందరూ తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తమ్మిశెట్టి రమాదేవి, మల్లె ఈశ్వరరావు, ఉప్పుటూరి పేరయ్య యాదవ్, నిమ్మల శేషయ్య, కంచర్ల శివరామయ్య, తుమ్మేటి మురళి, ఇంకొల్లు భగత్, తాళ్ళ వెంకటేష్‌యాదవ్, కావేటి వేణుగోపాల్, మద్దిరాల గంగాధర్, అడక శ్రీనివాసరావు, గుడిపల్లి వాణి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లపై యూజీసీ ప్రతిపాదనల్ని తిరస్కరించాలి


- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన

గుంటూరు, ఫిబ్రవరి 29: రిజర్వేషన్‌లపై యూనివరిటీస్ గ్రాండ్స్ కమిషన్ (యూజీసీ) చేసిన దుర్మార్గపు ప్రతిపాదనల్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని తిరస్కరించాలని ఆంధ్రప్రదశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో కేంద్ర విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేరనే సాకు చూపి, ఆఖాళీలను డీ రిజర్వ్‌చేసి, వాటిని తిరిగి జనరల్ అభ్యర్థులచే భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి, అన్ని యూనివర్సిటీలకు, కేంద్ర విద్యాసంస్థలకు, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అధికారవర్గానికి యూజీసీ అధికారికంగా సిఫార్సులు చేసిందన్నారు. దీనివలన ఎస్సీ, ఎస్టీ బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సిఫార్సుల అసలు లక్ష్యం రిజర్వేషన్‌లను ఎత్తేసే కుట్రగాభావిస్తున్నామని శంకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వెంగళాయపాలెంలో

ఉచిత వైద్యశిబిరం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి29: స్థానిక వెంగళాయపాలెంలో బండ్లమూడిహనుమాయమ్మ డిగ్రీ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత కుమారి, వైస్ ప్రెసిడెంట్ మాధవి, ఎన్ఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ కౌశల్యదేవి, ఎం.గిరిజ, లక్ష్మీ దీప్తి, భారతి పాల్గొన్నారు. అలాగే హిందూ కళాశాల జాతీయసేవా విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహపురం, వెంగళాయపాలెం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచి లిత కుమారి ప్రారంభించారు.





ప్రపంచ యుద్ధవీరుల

వితంతువులకు ఆర్థిక సాయం

గుంటూరుసిటీ, ఫిబ్రవరి 29 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 24 మంది రెండవ ప్రపంచ యుద్ధ వీరుల వితంతువులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. గురువారం గుంటూరు శ్యామల నగర్‌లోని గ్రూపు కమాండర్ ముఖ్య కార్యాలయం వద్ద జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్ గుణశీలా నగదు చెక్కులను వితంతు మహిళలకు అందజేశారు. అలాగే అనాథలుగా మారిన ఐదుగురు మాజీ సైనికుల పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమములో జిల్లా సైనికసంక్షేమ కార్యాలయ శాఖ సిబ్బంది, మాజీ సైనికుల సంఘాల అధ్యకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత జీఎంసీ

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 29: డాక్టర్ వైఎస్ఆర్ [illegible] విశ్వవిద్యాలయం పరిధిలో ఇటీవల జరిగిన రాజమండ్రిలో జరిగిన అంతర వైద్య కళాశాల క్రికెట్ టోర్నమెంటులో గుంటూరు వైద్య కళాశాల జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ కప్‌తో వచ్చిన క్రికెట్ జట్టును జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ అభినందించారు.

మధ్య, చిన్న తరహా పరిశ్రమలపై సర్వే

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 29: మధ్య, చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పనితీరును మెరుగుపరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడంకోసం సర్వే ప్రక్రియను ప్రారంభించామని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మదన్ శెట్టి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి1 నుంచి 20వరకు జిల్లాలో ఈ సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాలలోని అన్ని ఎంఎస్ఎంఈ లను డిజిటల్ ప్లాట్‌ఫాం లోకి తీసుకువచ్చి పోర్టల్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్‌యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అమెనిటీ సెక్రటరీస్ ఈసర్వే నిర్వహిస్తారని తెలిపారు.

కిష్కిందకాండ హరికథా గానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి29: స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ అన్నమయ్య కళావేదికపై మదజ్జాడాదిభట్ల నారాయణదాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో నారాయణదాసు 159వ జయంతి 79వ వర్ధంతి సందర్భంగా గురువారం హరికథాగానం నిర్వహించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి జయంతిసావిత్రి కిష్కింధకాండను వివరించారు. చావలి శ్రీనివాస్, నగధరరావు వాయిద్యసహకారం అందించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం

- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ప్రదర్శన

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 29: ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర సంఘం పిలుపు జిల్లాలోని పాత తాలూకా కేంద్రాల వద్ద ఎపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, నిరసన ప్రదర్శలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శిలు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు మాట్లాడుతూ పీజేఏసీ ఉద్యమం చేస్తుంటే చర్చలకు ఉద్యమం చేసేవాళ్లను పిలవకుండా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్య సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి 13 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్‌ను మోసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. 12వ పీఆర్సీలో ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, పెండింగ్ బాకాయులు విడుదల, పాత విధానంలో అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ కొనసాగించాలని, పెండింగ్ డిఎలు విడుదల చేయాలని ఉపాధ్యాయుల పై మోపిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలనే పలు డిమాండ్స్‌తో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పీ. లక్ష్మీనారాయణ, జీ.దాస్, పీ.పార్వతి, కార్యదర్శులు ఎస్ఎస్ఎన్ మూర్తి, కే.రమేష్, పీ.శ్రీను, కిషోర్, ఎస్ రాంబాబు, కిరణ్, అంకారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను జమ చేయాలి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి29: భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో గత ఐదేళ్ల నుంచి వాడుకున్న నిధులను వెంటనే తిరిగి బోర్డుకు జమచేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయడంపై ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్మిక సంఘాలు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 300 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2006లో ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులో రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకుని కార్డులు ద్వారా సంక్షేమ ఫలాలు 2019 వరకు పొందారని గుర్తుచేశారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ ఈ బోర్డును నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి పవర్ ఫైనాన్స్ పేరుతో కార్పొరేషన్లకు దారి మళ్లించుకున్న నిధులను వెంటనే బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేయకపోతే ఎన్నికలకు సిద్ధమని చెప్పే జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు కార్మికులకు కూడా అంతే సిద్ధంగానే ఉంటారని హెచ్చరించారు. ధర్నాలో డీ.లక్ష్మీనారాయణ, దీనెనరావు, గాబ్రియేల్, పుప్పాల సత్యనారాయణ, అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతురావు, లింగారావు, మోజేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు నేతలు

అరుదైన సినిమా అవుతుంది



"గామి' అరుదైన సినిమా. ఆరేళ్లపాటు అంకితభావంతో తెరకెక్కించడం మామూలు విషయం కాదు. సినిమాపై ఎంతో ప్రేమ ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన 'గామి' చిత్రం ట్రైలర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'ఇది రెగ్యులర్ చిత్రం కాదు. మాస్ అంశాలు ఉండవు. అయినా 'గామి' ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. సినిమా చూస్తున్నంతసేపు తర్వాత ఏం జరగబోతోందో అనే ఉత్సుకత ప్రేక్షకుల్లో కలుగుతుందని విద్యాధర్ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారికీ, సాయం చేసిన వారికి నిర్మాత శబరీషన్ ధన్యవాదాలు తెలిపారు.

అరి అన్వేషణ



వినోద్‌వర్మ, సూర్య పురిమెట్ల, అనసూయ భరద్వాజ్, సాయికుమార్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'అరి'. 'పేపర్‌బాయ్' ఫేం జయశంకర్ దర్శకుడు. శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి వినోద్ వర్మ క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గ్రంథాలయంలో తీక్షణంగా శోధిస్తున్న లుక్‌లో ఆయన కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రఫీ: కృష్ణ ప్రసాద్


శ్రీవిష్ణు డబుల్ ధమాకా



గురువారం హీరో శ్రీవిష్ణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన కథానాయకుడిగా రెండు కొత్త చిత్రాలను నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ సంయుక్తంగా కార్తిక్‌రాజు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అల్లు అరవింద్ సమర్పకులు. 'ఎస్ వీ 18' వర్కింగ్ టైటిల్. వినూత్నమైన ప్రేమకథా చిత్రమిదని నిర్మాణ సంస్థలు పేర్కొన్నాయి. అలాగే హసిత్ గోలీ దర్శకత్వంలో శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రానికి 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

మనసు నొచ్చుకుంటే మన్నించండి

నాగేంద్రబాబు



వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగేంద్రబాబు మాట్లాడుతూ 'ఆరడుగుల మూడంగుళాలు ఉండే హీరోలు పోలీసు పాత్రలు చేస్తే బావుంటుంది. ఐదడుగుల మూడంగుళాలు ఉండే హీరోలయితే చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంద'ని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు టాలీవుడ్ హీరోల అభిమానులు సోషల్ మీడియాలో నాగబాబు తీరును తప్పుపట్టారు. దీంతో సోషల్ మీడియా వేదికగా నాగేంద్రబాబు స్పందించారు. 'ఎవరినో తక్కువ చేయాలని అలా మాట్లాడలేదు, నా మాటల వల్ల ఎవరి మనసునైనా నొప్పించి ఉంటే క్షమించండి' అని కోరారు.

ముచ్చటగా మూడోసారి



నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్, దర్శకుడు ఇంద్రగంటి మోహన్ కృష్ణ ముచ్చటగా మూడోసారి ఓ సినిమాను పట్టాలెక్కించనున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో కథానాయకుడిగా ప్రియదర్శి నటించనున్నారు. మార్చి నెలాఖరు నుంచి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సూపర్ హిట్ కాంబోగా పేరున్న వీరిద్దరి నుంచి గతంలో వచ్చిన రెండు చిత్రాలూ విశేష ప్రేక్షకాదరణను పొందాయి. దీంతో ఈ మూడవ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి చిత్రం 'జెంటిల్‌మేన్' 2016లో విడుదలై భారీ విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ సినిమాలో నాని, నివేథా థామస్, సురభి నటించారు. ఆ తర్వాత 2017లో వచ్చిన మరో సూపర్ హిట్ చిత్రం 'సమ్మోహనం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ఇందులో సుధీర్ బాబు, అదితి రావు హైదరీ ప్రధాన పాత్రలు పోషించారు.

తల్లి కాబోతున్న దీపికా పదుకొణె



బాలీవుడ్ బెస్ట్ కపుల్స్‌లో ఒకరిగా పేరొందిన దీపికా పదుకొణె, రణ్‌వీర్ సింగ్ జంట అభిమానులకు తీపి కబురందించారు. త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చారని ఆ పోస్టులో పేర్కొన్నారు. 2013లో రణ్‌వీర్, దీపికా 'రామ్‌లీలా'లో కలిసి నటించారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఇరువురూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత 2018లో వీరిద్దరూ ఇటలీలో ఘనంగా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్నారు.



మంచి సినిమాతో వస్తున్నాం

శివ కందుకూరి



శివ కందుకూరి హీరోగా రూపొందిన యూనిక్ క్రైమ్ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర నారాయణ' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శివ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్స్ తెలుగులో చాలా వచ్చాయి. అందుకే ఏదో కొత్తదనం ఉంటే తప్ప అలాంటి సినిమా చేయకూడదని అనుకున్నాను. 'భూతద్దం భాస్కర నారాయణ' చిత్ర కథ విన్నాక కొత్తగా అనిపించింది. ఎందుకంటే ఇందులో మైథాలజీ ఎలిమెంట్ కూడా ఉంది. దిష్టి బొమ్మ చూస్తుంటాం. కానీ అసలు ఎందుకది అనే విషయాన్ని పట్టించుకోం. దీని గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. ఆ కథకు క్రైమ్, డిటెక్షన్ అంశాలు జోడించాం. కచ్చితంగా ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మా చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ విడుదల చేస్తుండడం మరింత బలాన్ని ఇచ్చింది' అని చెప్పారు.

కొత్త కాన్సెప్ట్‌తో... ఎస్ 99



సి.జగన్ మోహన్ దర్శకత్వంలో యతీష్, నందిని నిర్మించిన 'ఎస్ 99' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక ఇటీవలే నిర్వహించారు. ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ అందివ్వాలనే ఉద్దేశంతో విలక్షణ సబ్జెక్ట్‌ను ఎంచుకున్నామని దర్శకుడు తెలిపారు. ఇది విజువల్స్, సౌండ్ ప్రధానంగా సాగే కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమన్నారు. ఎటువంటి నేరచరిత్ర లేని ఒక వ్యక్తి క్రైమ్‌కు పాల్పడితే ఎలా ఉంటుందో ఆసక్తికరంగా చూపించడమే కథాంశమని వివరించారు. సినిమాకు టీం స్పిరిట్ ప్రధానమని, ఈ విషయంలో మాకు మంచి టీం దొరికిందని నిర్మాత యతీష్ సంతోషం వ్యక్తం చేశారు.

జానపద, సినీగాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత




ప్రముఖ జానపద, సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్(64) గురువారం ఉదయం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి శ్రీనివాస్‌నగర్‌లోని తన స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇందిర, కుమార్తె మానస ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 14వేల ప్రదర్శనలను ఇచ్చిన శ్రీనివాస్ తొలిసారిగా 'నమస్తే అన్న' చిత్రంలో 'గరం... గరం... పోరీ... నా గజ్జెల సవారీ' పాట పాడారు. ఆ తర్వాత నాగార్జున 'కింగ్' సినిమాలో 'గింత, గింత బాల చుక్కవే' పాట పాడారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గబ్బర్‌సింగ్' చిత్రంలో శ్రీనివాస్ పాడిన 'గన్ను లాంటి కన్నులున్న...' పాట ఎంతో హిట్ అయ్యింది. ఈ పాటకు 2012 సంవత్సరంలో ఉత్తమగాయకుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. గురువారం సాయంత్రం వడ్డేపల్లి శ్రీనివాస్ అంత్యక్రియలు సీతాఫల్‌మండి శ్మశానవాటికలో జరిగాయి.

బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)











నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన నిడుబ్రోలు వైసీపీ శ్రేణులు

వైసీపీ అక్రమాలతో ప్రజలు విసిగిపోయారు

● ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 29: వైసీపీ ప్రభుత్వ అక్రమాలతో రాష్ట్ర ప్రజలు విసిగివేసారి తెలుగుదేశం వైపు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువారం నరేంద్రకుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన పైడిమాల మహేష్, చేబ్రోలు రవిచంద్, యాతాటి రమేష్, బంగి జీవరత్నం, బట్టు చార్లెస్, కత్తిబాబు, బొర్రా కిరణ్ కుమార్, బొల్లెద్దు ప్రసాద్ తదితరుల కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని నరేంద్రకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా తిరుగుబాటు ప్రారంభమై వైసీపీ పాలనకు ముగింపు పలకనున్నదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దు సోంబాబు, నిడుబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, పట్టణ, మండల అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, బండ్లమూడి బాబురావు, జి.సుభాష్, చేబ్రోలు కిషోర్, ఏసుపాదం, తిరుపతి రమేష్, ఎం.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు తెనాలిలో 14 పరీక్షా కేంద్రాలు

● హాజరుకానున్న 4426 మంది విద్యార్థులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పట్టణంలో 14పరీక్షా కేంద్రాలలో 4426మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి 1 నుంచి 20వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశాలు జారీచేశారు. పట్టణంలోని ఎన్నారై కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాల, చైతన్య, జేఎంజే, అంబేద్కర్, నెహ్రూనికేతన్, నారాయణ, వీఎస్‌ఆర్ అండ్ ఎన్‌వీఆర్, వివేక, వివేకానంద కళాశాలల్లో పరీక్షల నిర్వహణకు ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను కళాశాలల ప్రిన్సిపాల్స్, పరీక్షల నిర్వాహకులు పర్యవేక్షించారు.

మార్చి 3న సైన్స్ నమూనాల పోటీలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 29: ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 3న సైన్స్ నమూనాల పోటీలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, 5నుంచి 10వ తరగతి వరకు సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన నమూనాలను ఈ పోటీల్లో ప్రదర్శించవచ్చన్నారు. విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచేందుకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకు సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. సీఈవో నన్నపనేని భాస్కర్ మాట్లాడుతూ, పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో తాము రూపొందించిన ఎగ్జిబిట్‌లను ప్రదర్శించాలని కోరారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 29: పట్టణంలో పేద ప్రజల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో గురువారం ఎన్నారై విద్యా సంస్థల సహకారంతో, శివాజీ చౌక్‌లో అన్న క్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, మాదల కోటేశ్వరరావు, క్రొత్తపల్లి రమేష్, వెల్లంకి సాంబయ్య, ముళ్లపూడి వెంకట్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

3న జరిగే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

● ఎంపీపీ పద్మావతి

కొల్లిపర, ఫిబ్రవరి 29: మండలంలో మార్చి 3వ తేదీ నుంచి జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్స్‌పోలియో మండల టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఎంపీడీవో దేవసేనకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నూటికి నూరుశాతం పిల్లలందరికి పోలియో చుక్కలు వేయాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. మండల వైద్యాధికారి లక్ష్మీసుధ మాట్లాడుతూ మండలంలో పల్స్‌పోలియో చుక్కలను వేయటానికి 26సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ పూర్ణశంకర్‌రావు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షారోన్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని షారోన్ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాల ప్రదర్శనను గురువారం ఎంఈవో లక్ష్మీనారాయణ ప్రారంభించారు. వాతావరణ కాలుష్యం - నివారణ వంటి పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పాస్టర్ అహరోన్, డైరెక్టర్ శ్యాంబెనర్జీ, ప్రిన్సిపల్ మేరీ బెనర్జీ పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, బిల్లు బకాయిలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, సమాధానం ఇస్తున్న అధికారి నాగమల్లేశ్వరరావు, ఇంటిపట్టాలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ మొఘల్ అహ్మద్‌బేగ్, నీటి పన్నులపై ప్రశ్నిస్తున్న అడుసుమల్లి వెంకటేశ్వరరావు

అధికారుల నిర్లక్ష్యం వల్లే బిల్లుల పెండింగ్

- బిల్లు పెండింగ్‌లో ఉంటే పనులు ఎలా సాగుతాయి
- నీరు రాకున్నా పన్ను వేయడం తగదు
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం
- లీకుల మరమ్మతులకు కమిటీని నియమిద్దాం
- కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 29: మునిసిపల్ పరిధిలో వివిధ రకాల పనులకు క్రాంట్రాక్టర్లను నియమించారు.. వారి ద్వారా పనులు చేయించారు. ఇవి జరిగి రోజులు గడుస్తున్నా ఇంతవరకూ ఆ పనులు తాలూకా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టు పనులు అంటేనే భయపడే పరిస్థితి వచ్చిందని ఇందుకు పూర్తిగా మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ విభాగ వైఫల్యమే కారణమని వైసీపీ 34వ వార్డు కౌన్సిలర్ పేరం సంజీవ రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సాధారణ, అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సభలో అజెండాలోని పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఐతే వైసీపీ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి చైర్‌పర్సన్ రాధిక దృష్టికి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు బిల్లులపై పట్టుబట్టారు. పట్టణ అభివృద్ధికి కేటాయించిన పనులను కొందరు క్రాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేస్తున్నా ఇంజనీరింగ్ విభాగంలో బిల్లులను అప్‌లోడ్ చేసే ఉద్యోగులు కరువయ్యారని దీని ఫలితంగా శ్రీనివాస్ కాంట్రాక్టు వర్క్సుకు చెందిన సుమారు 40 బిల్లులు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొందని, మరిన్ని అభివృద్ధి పనులకు కాంట్రాక్టు పద్ధతిలో టెండర్లు పిలుస్తున్నా ఆ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెబుతూ.. వెంటనే అన్ని విభాగాలను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఈ అంశాలన్నీ పరిశీలించి మరోసారి ఫిర్యాదులు రాకుండా చూస్తానని కౌన్సిల్‌లో హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని 4వ అంశం చదవడం పూర్తికాగానే 33వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్‌బేగ్ లేచి తన వార్డులో షేక్ షమీమ్‌కు పెదరావూరులో ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలం మంజూరు అయిందని కానీ ఆమెకు సచివాలయ ఉద్యోగులు గోలిడొంకలో నీ పేరిట స్థలం వచ్చిందని చెప్పి ఇంతవరకూ ఆ స్థలాన్ని ఆమెకు చూపించలేదని ఆయన ప్రశ్నించారు. సాంకేతికంగా జరిగిన పొరపాటు వల్ల కొంతమందికి ఇలా జరిగిందని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. మరో అంశంగా తన వార్డు చేయూత లబ్ధిదారుల నుంచి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నగదు డిమాండ్ చేస్తూ వాటిని వసూలు చేస్తున్నాడని జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదులు చేయడం జరిగిందని, అతనిపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ తన వద్ద ఉన్న ఆధారాలుచూపి మొఘల్ అహ్మద్‌బేగ్ డిమాండ్ చేశారు. తెనాలి పట్టణంలో రక్షిత మంచినీటి కుళాయి తీసుకున్న వారికి కూడా నీటిని ఎందుకు అందించలేకపోతున్నామని వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కౌన్సిల్‌లో ప్రశ్నించారు. నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్దామని కమిషనర్ బదులిచ్చారు. టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని వార్డులకు ఇంతవరకూ తాగునీటి కనెక్షన్లు లేకపోగా ఉన్నా కొన్నింటికి నీరు రావడంలేదన్నారు. ఐతే వారికి కూడా నీటి పన్ను విధిస్తున్నారని తక్షణమే వారిపై పన్నుల భారాన్ని నిలిపివేయాలని కోరారు. అదే విధంగా తాగునీటి పైపులైన్లు లీకులవుతున్నా వాటిని సకాలంలో గుర్తించి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్య సమస్యల పాలవుతున్నారని ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను చదివి ఆమోదించారు. అలాగే అత్యవసర సమావేశాన్ని నిర్వహించి దానిలోని ఐదు అంశాలు ఆమోదించారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టిన మునిసిపల్ కమిషనర్ శేషన్న కౌన్సిల్ సభ్యులను పరిచయం చేసుకున్నారు. వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఎంఈ కె. నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో అనుబంధం మాటల్లో చెప్పలేనిది

● ఆత్మీయ సమావేశంలో ఆలపాటి భావోద్వేగం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 29: తెలుగుదేశం పార్టీ శ్రేణులందరినీ తన కుటుంబసభ్యులుగా భావించానని వారితో తనకు ఉన్న ఆత్మీయత మాటల్లో చెప్పలేనిదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భావోద్వేగానికి లోనయ్యారు. పట్టణంలోని కొత్తపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తన ఇంట్లో కుటుంబంతో కన్నా పార్టీ శ్రేణులతోనే ఎక్కువ సమయం గడిపానని, వారితో ఉన్న ఆత్మీయత, అనుబంధం సొంత కుటుంబసభ్యులకంటే మిన్నగా ఉందన్నారు. అధినేత చెప్పిన మాట ప్రకారం మనందరం కట్టుబడి ఉండాలన్నారు. ఇక్కడ పోటీ చేసే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుని అసెంబ్లీకి తీసుకువెళ్లే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాను ఇక్కడ పోటీ చేయడం లేదని అందరిని విడిచి వెళతానని ఆలోచన చేయవద్దన్నారు. తాను ఇకపై కూడా పార్టీ శ్రేణులందరితో కలిసి ఉంటానన్నారు. ఆలపాటి మాటలతో ఒక్కసారిగా పార్టీ తెలుగు మహిళలు, నాయకులు కంటతడిపెట్టారు. రాజకీయాల్లో సీటు లేదని తెలిసిన వెంటనే పార్టీ శ్రేణులను వదిలి ఆలపాటి వెళ్లిపోతాడేమోనన్న భయంతో తామంతా ఉంటే ఆయన చెప్పిన మాటలతో తమకు కంట కన్నీళ్లు ఆగడంలేదంటూ ఆలపాటి ఎదుట పార్టీ శ్రేణులు ఆవేదన చెందారు. పార్టీ శ్రేణులను ఓదార్చిన ఆలపాటి రానున్న ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించారు. రానున్న ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని గతంలో జరిగిన పొరపాట్లను ఈసారి ఎన్నికల్లో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వాన్ని బలపరుచుకుని తెనాలిలో తిరిగి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. తాను కూడా ఎన్నికల ప్రచారంలో పార్టీ శ్రేణులందరితో కలిసి పాల్గొంటానన్నారు. ఇదే ఉత్సాహంతో అందరం కలిసికట్టుగా పనిచేసి అధినేతను సీఎంగా గెలిపించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని ఆలపాటి స్పష్టం చేశారు. నియోజవర్గ స్థాయి ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై ధర్నా


- ఎమ్మెల్యే కిలారి బినామీలపేరిట చేశారంటూ నినాదాలు
- దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న పెదకాకాని మండల దళిత రైతులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 29: పెదకాకాని మండలం అనుమర్లపూడిలో కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారంటూ, బాధిత రైతులు దుగ్గిరాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. అనుమర్లపూడికి చెందిన బాధిత రైతులు, అనుమర్లపూడిలోని 22.5ఎకరాల ఊరచెరువు భూముల రిజిస్ట్రేషన్ చేయడాన్ని తప్పుబడుతూ, సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీశారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య, సబ్‌రిజిస్ట్రార్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. బాధిత రైతులతో కలిసి వచ్చిన పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ మాట్లాడుతూ పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య తన అధి కారాన్ని అడ్డుపెట్టుకుని వెంకటకృష్ణాపురానికి చెందిన, తన బినామీలైన పెదకాకాని శివాలయం ఛైర్మన్ అమ్మిశెట్టి శంకరరావు కుమారుడు మల్లికార్జునరావు, సాంబశివరావు, కోడలు సరిత, పొన్నూరు మండలానికి అన్నవరపు సురేష్, మహేష్, శ్రీనివాసశర్మ, కొంపెళ్ల కామేశ్వరరావుల పేరిట రిజిస్టర్ చేయించారని ఆరోపించారు. దశాబ్దాల కాలంగా సాగు చేసుకుని జీవిస్తున్న దళితుల భూములను బినామీలకు అప్పగించడం అన్యాయమని, తమకు న్యాయం చేయాలంటూ తీవ్రమైన చర్య అని అన్నారు. 2008లో 56మంది రైతులు కోర్టులో వేసిన రిట్‌పిటిషన్ కొందరు రైతుల ఫోర్జరీ సంతకాలతో 2022లో కోర్టుకు సమర్పించి, పిటిషన్‌ను కొట్టి వేయించుకున్నారన్నారు. భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 6 డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని రిజిస్ట్రార్ చెబుతున్నారన్నారని, రెవన్యూ రికార్డులను తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. పొన్నూరు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి రోశయ్య దళిత భూములపై కన్నేశారన్నారు. దళిత భూములు తిరిగి వారికి అప్పగించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని, అప్పటి వరకూ ఉద్యమం ఆగదని అన్నారు.

రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి బొల్లెద్దు సుశీలరావు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ గతంలో, పెదకాకాని తహసీల్దార్ వద్దకు వెళ్లి ఈభూములు కొట్టేయాలని ఎమ్మెల్యే చూస్తున్నారని చెప్పారని గుర్తుచేశారు. కోర్టులో అభ్యంతరం ఉన్నప్పటికీ వెంటనే రిజిస్ట్రేషన్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, దళితుల భూములు వారికి అప్పగించే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శివసాంబిరెడ్డి

రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలి

● పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 29: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వపరంగా పట్టించుకోకపోవడం ఆశ్చర్యంగా ఉందని పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురంలో పసుపు రైతులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగి 40రోజులు కావస్తున్నా కోల్డ్‌స్టోరేజీ యజమాని నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అగ్నిప్రమాదానికి నష్టపోయిన రైతుల పక్షాన దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. పసుపు రైతులు నిరాహార దీక్షను విజయవంతం చేయాలన్నారు. నిరాహార దీక్షను శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణ్‌రావు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతులు లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కూసం శ్రీనివాసరెడ్డి, తాడిబోయిన సురేష్‌బాబు, గుదిబండి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల ఏఎంసీలో బాధితుల వివరాల ప్రచురణ



దుగ్గిరాల యార్డుకార్యదర్శి శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

దుగ్గిరాల, ఫిబ్రవరి 29: జనవరి 19న జరిగిన అగ్ని ప్రమాదంలో బాధిత రైతులు, వ్యాపారుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచినట్లు మార్కెట్‌యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో పంట నిల్వలు పెట్టిన రైతులు, వ్యాపారుల వివరాలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో తెలియజేయాలని కోరిన మీదట వారు అందించారన్నారు. కోల్డ్‌స్టోరేజి వారు సైతం తమవద్ద ఉన్న వివరాలను కమిటీకి అందించారన్నారు. కాగా సబ్ కలెక్టర్ మార్కెట్ యార్డును గురువారం సందర్శించి నష్టపోయిన రైతులు, వ్యాపారుల వివరాలు ప్రచురించాలని ఆదేశించిన మీదట వివరాలను నోటీసు బోర్డులో ఉంచామని, సందేహాలున్న వారు, సూపర్‌వైజర్ రాంబాబు సెల్‌నెం.99494 99820లో సంప్రదించాలని తెలిపారు. తప్పులున్నాయని భావించిన వారు బీమా పత్రాలనకలు, పంట నిల్వకు సంబంధించిన బాండ్లు, పట్టాదారు పాస్ పుస్తకాల నకళ్లతో యార్డులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 29: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వహాబ్ రోడ్డులోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో క్లబ్ సభ్యుడు ఇడపలపాటి వెంకటేశ్వర్లు వర్థంతి నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకులు కె. సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు, రమేష్‌కృష్ణ, దిల్‌బహార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా దేవసేనకుమారి బాధ్యతల స్వీకరణ



ఆర్. దేవసేనకుమారి

కొల్లిపర, ఫిబ్రవరి 29: కొల్లిపర మండలం ఎంపీడీవోగా ఆర్.దేవసేనకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలంలో పనిచేస్తున్న దేవసేనకుమారి కొల్లిపరకు బదిలీపై వచ్చారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా దేవసేనకుమారి తొలుత బాపట్ల పార్లమెంట్ పరిధి అద్దంకిలో పనిచేస్తుండగా రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలంకు బదిలీచేశారు. నిజాంపట్నం, అద్దంకి ఒకే పార్లమెంటు పరిధిలో ఉండటంతో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మరల తిరిగి బాపట్ల పార్లమెంట్ పరిధిలో కాకుండా గుంటూరు పార్లమెంట్ పరిధిలోని తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలంకు బదిలీ చేశారు. కొల్లిపర ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న విష్ణుప్రసాద్ వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలంకు బదిలీ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

పేదలకు వాసవి క్లబ్‌ల చేయూత

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 29: పేదలకు వాసవి క్లబ్ చేయూతను అందిస్తున్నాయని ఆ సంస్థ అధ్యక్షుడు ఎ.కిషోర్ అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురువారం లీప్ డే నిర్వహించారు. 32మంది పేద మహిళలకు ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆదిత్య ప్రొవిజన్స్ సంస్థ సహకారంతో అందచేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు ఆలపాటి సుజన్, బి.ప్రసాద్, నాగసూరి ప్రతాప్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రోశయ్య, శివ, రామారావు, భవనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 29: భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డు పథకాలను అమలుచేయాలని సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి డిమాండ్ చేశారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇసుక రేట్లను పెంచి అన్నిరంగాల కార్మికులకు పనిలేకుండా చేసిందన్నారు. కార్మిక సంఘాల నాయకులు బి.నాగేశ్వరరావు, రవికుమార్, సుబ్బారావు, శంకర్, కృష్ణ, సాంబయ్య, ప్రాన్సిస్, శ్యామ్, ప్రేమ్ పాల్గొన్నారు.

అధ్యయనంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు

● హెచ్‌ఎం ఏడుకొండలు

చేబ్రోలు, ఫిబ్రవరి 29: చదవటం కన్నా అధ్యయనంతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు లభిస్తుందని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అన్నారు. నారాకోడూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 300మంది గురువారం వృత్తివిద్యా శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్‌వీఐటీ కళాశాలను సందర్శించారు. కళాశాలలో ఉన్నత విద్యలో అందించే శిక్షణ తరగతులు, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ ప్రయోగశాలను పరిశీలించి వాటిద్వారా అందించే విద్యాబోధనపై అవగాహన కల్పించారు. ఆర్‌వీఐటీ ప్రిన్సిపాల్ డి.శ్రీధర్ వృత్తి విద్యా శిక్షకులు ఏ దుర్గాబాయి, కె.రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

● డ్వామా ఏపీడీ బాలమ్మ

కొల్లిపర, ఫిబ్రవరి 29: పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కలిగించాలని డ్వామా ఏపీడీ బాలమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు నూటికి నూరుశాతం సబ్సిడీపై పండ్ల తోటలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందటం కోసం ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. ఎకరం నుంచి ఐదు ఎకరాల వరకు పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అనంతరం మండలంలోని సాగుచేసిన పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు ఎం.రవి, అజయ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజా తదితరులు పాల్గొన్నారు.